క్లుప్తంగా

పీఏసీఎస్ గోదాంలో తనిఖీ



ఖానాపురం : మండలంలోని రాగంపేటలోని చెన్నారావుపేట పీఏసీఎస్ గోదామును ప్రత్యేక అధికారి సౌజన్య, తహసీల్దార్ రమేశ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించొద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందజేస్తుందని తెలిపారు. అధిక ధరకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. ఈ-పాస్ యంత్రాల తోనే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్, ఏఈఓ ఆశాదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో స్లాబ్ పెచ్చులూడి కలకలం



నర్సంపేట రూరల్ : నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనం స్లాబ్ పెచ్చులూడి కిందపడడం శనివారం కలకలం రేపింది. వివరాలిలా.. ఆస్పత్రి భవనంలోని పిల్లల వార్డు సమీపంలోని వరండాలో ఉదయం స్లాబ్ పెచ్చలూడి కిందపడ్డాయి. పక్కనే పిల్లల వార్డుకు సంబంధించిన గదులుండగా ఆ సమయంలో అటుగా ఎవరూ వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో రోగులు, వైద్యులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. మరోసారి ఇలాంటి జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని, రోగులు, వైద్యులు, సిబ్బంది ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కార్గిల్ విజయ్ దివస్



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్గిల్ యుద్ధం గురించి విద్యార్థులకు వివరించారు. జూలై 26, 1999 నాడు కార్గిల్ యుద్ధం గెలిచిన క్రమంలో ఏటా వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, రామ్మూర్తి, విజయ్, గౌతమ్, కనకయ్య, రాంకిషోర్, ఓదెలు, కనకరాజు, అనిత, భవాని చందు, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా శ్రీనివాస్

రాయపర్తి : సీపీఐ మండల కార్యదర్శిగా మండలంలోని పెర్కవేడుకు చెందిన బొట్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో శ్రీనివాస్ శనివారం మాట్లాడారు. పార్టీలో కీలకంగా పని చేస్తుండడాన్ని గుర్తించి తనను ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి, మండలంలో పార్టీ బలోపేతానికి పాటుపడతానని చెప్పారు. తన ఎన్నికకు సహకరించారంటూ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి బాషుమియా, జిల్లా సమితి సభ్యుడు గాజు యాకయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలిపై కోతుల దాడి



నెక్కొండ : మండలంలోని చంద్రుగొండకు చెందిన వృద్ధురాలు బక్కి లక్ష్మిపై శనివారం ఉదయం కోతులు దాడి చేశాయి. ఇంట్లో పనులు చేసుకుంటుండగా గుంపుగా వచ్చిన కోతులు దాడి చేయడంతో ఆమె చేతికి గాయమైంది. వృద్ధురాలిని కుటుంబీకులు స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పరామర్శ



నర్సంపేట : పట్టణానికి చెందిన ఎస్‌బీఐ ఉద్యోగి సుంకరి సాంబయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని, ఆయన సమీప బంధువైన బీఆర్‌ఎస్ నాయకుడు అప్పాల సుదర్శన్‌ను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. తొలుత మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణ, ప్రధాన కార్యదర్శి వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనాల్లేక ఇబ్బందులు

- చెట్ల కింద, ఇళ్లలో మహిళల సమావేశాలు



ఆరుబయటే ఏర్పాటు చేసిన ధనలక్ష్మి వీఓ సమావేశం (ఫైల్)

నెక్కొండ : సొంత భవనాల్లేక మండలంలోని మహిళా పొదుపు సంఘాల సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల నిర్వహణ కొనసాగుతున్న విషయం తెలిసిందే. స్వశక్తి సంఘాల ఏర్పాటు నుంచి ఇప్పటివరకు సొంత భవనాలు ఏర్పాటు చేయని దుస్థితి మండలంలో నెలకొంది. ప్రతినెలా మహిళలు గ్రామాల్లోని చెట్ల కింద, సభ్యుల నివాసాల్లో సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితి చోటు చేసుకుంది.

43 గ్రామైక్య సంఘాలు..

మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో 1290 స్వయం సహాయక సంఘాలుండగా 13298 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా మహిళలు జీవనోపాధి అవకాశాలు పెంచుకుంటూనే పొదుపులో ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామస్థాయిలో కార్యాలయాలు లేక మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు, చెల్లింపులు, సభ్యుల్లో చైతన్యం విషయంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ క్రమంలో సరైన వేదికలు లేకపోవడం వేదనకు గురి చేస్తోంది. ప్రభుత్వ లక్ష్యం సైతం నెరవేరడం లేదన్న వ్యాఖ్యలున్నాయి.

వెంటాడుతున్న సమస్యలు

సొంత భవనాల్లేక సంఘాల కార్యకలాపాల నిర్వహణతోపాటు సమావేశాల నిర్వహణ, శిక్షణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామైక్య సంఘాల వద్దకు వివిధ పనుల కోసం వచ్చే మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులకు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించలేదు. గ్రామీణ ప్రాంత్రాల్లో మహిళా సంఘాల నిర్వహణ కోసం మండల కేంద్రంలో ఇందిరా క్రాంతి పథకం పేరిట సొంత భవనం సైతం ఏర్పాటు చేయలేదు. సొంత భవనాలు నిర్మిస్తే సంఘాల నిర్వహణలో తలెత్తే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. మండలంలోని దీక్షకుంట, గుండ్రపల్లి, పెద్దకొర్పోలు, నెక్కొండ గ్రామాల్లో మహిళా సంఘాలకు భవనాలున్నా మిగితా గ్రామాల్లో లేవు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సంక్షేమం దిశగా అన్ని గ్రామాల్లోనూ సొంత భవనలు నిర్మించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం సొంత భవనాల నిర్మాణాల ఆవశ్యకతను ఉన్నతాధికారులకు నివేదించాం. మండలంలో భవనాలు నిర్మించాల్సి ఉందన్న ప్రతిపాదనలు పంపించాము. పలు గ్రామాల్లో సభ్యుల నివాసాల్లో, కమ్యూనిటీ హాళ్లలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టి కూడా తీసుకెళ్లాం.

- శ్రీనివాస్, ఏపీఎం నెక్కొండ

వర్షానికి చెరువులకు జలకళ



సంగెం : మత్తడి పోస్తున్న కుంటపల్లి చెరువు

నర్సంపేట/నల్లబెల్లి/సంగెం/రాయపర్తి : ఎడతెరిపి లేని వర్షానికి చెన్నారావుపేట, నల్లబెల్లి, సంగెం మండలాల్లో చెరువుల్లో జలకళ సంతరించుకుంది. చెరువులు, కుంటల్లోకి శనివారం నీరు భారీగా చేరింది. చెన్నారావుపేట శివారులోని కోపాకుల చెరువులో నీటిమట్టం 8 అడుగులకు చేరుకోగా నిండుకుండను తలపిస్తోంది. మరో 5 అడుగులకు నీరు చేరితే మత్తడి పోయనుంది. నల్లబెల్లి మండంలోని ముచ్చింపుల వెంకటపాలెం చెరువుకు ప్రమాదం పొంచి ఉంది. తూము చుట్టు మట్టి కుంగిపోయి నీరు వృథా పోతోంది. తహసీల్దార్ ముప్పు కృష్ణ తూమును పరిశీలించి ఐబీ ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. సంగెం మండలంలోని కుంటపల్లి చెరువులోకి వరద నీరు భారీగా చేరడంతో శుక్రవారం రాత్రి నుంచే మత్తడి పోస్తోంది. రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాయపర్తి మండలంలోని ల్యాబర్తి ఆకేరు వాగు తూము తలుపులు ధ్వంసం కావడంతో కొత్తూరు ఊరచెరువుకు చేరాల్సిన వర్షపు నీరు వృథా పోతున్న దుస్థితి నెలకొంది.



నర్సంపేట : కోపాకుల చెరువులో నీటి ఉధృతి



నల్లబెల్లి : తూమును పరిశీలిస్తున్న తహసీల్దార్

వనమహోత్సవం



నర్సంపేట : పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో శనివారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ భాస్కర్ హాజరై మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమర్‌నాథ్, పర్యావరణ ఇంజనీర్ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హోర్డింగ్‌పై కోతుల హల్‌చల్



వర్ధన్నపేట : పట్టణంలోని ఓ భవనంపై ఏర్పాటు చేసిన హోర్డింగ్‌పైకి కోతులు శనివారం పదుల సంఖ్యలో చేరుకుని హల్‌చల్ చేశాయి. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి కావడంతో ప్రయాణికులు వాహనాలను ఫొటోలు, వీడియోలు తీస్తూ సందడి చేశారు. హోర్డింగ్‌లపై ఏర్పాటు చేసిన అడ్వర్టైజ్‌మెంట్‌లనే కాకుండా తమను సైతం చూపి తమ సమస్యలకు పరిష్కారం సూచించండి అని కోరుతున్నట్లుందని పలువురు చర్చించుకోవడం కనిపించింది.

బాలలకు తోడ్పాటు అభినందనీయం




విద్యార్థినులతో రోటరీ క్లబ్ అధ్యక్షుడు శివప్రసాద్, ఎంఈఓ లింగారెడ్డి, తదితరులు

- మండల విద్యాధికారి గాయపు లింగారెడ్డి

పర్వతగిరి : అనాథ బాలలకు రోటరీ క్లబ్ తోడ్పాటు అందించడం అభినందనీయమని మండల విద్యాధికారి (ఎంఈఓ) గాయపు లింగారెడ్డి తెలిపారు. మండలంలోని కేజీబీవీలో చదువుతున్న 20 మంది తల్లిదండ్రులు లేని అనాథ బాలికలకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ అధ్యక్షుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం సుమారు రూ.85 వేల విలువైన డ్రెస్సులు, యోగా మ్యాట్, స్టడీ చైర్, వాటర్ బాటిల్స్, ఎగ్జామ్ పాడ్స్, డిక్షనరీలు, పెన్సిల్ బాక్సు, టార్చ్ లైట్స్, పెన్నులు, నోట్‌బుక్స్, లగేజి బ్యాగ్స్, రైటింగ్ పాడ్స్, టవల్స్, కర్చీఫ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులు మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్లబ్ అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదిగి సామాజిక సేవల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రత్యేక అధికారి నాజియా సల్మా, క్లబ్ కార్యదర్శులు జి.ఎల్లరాజు, డి.నర్సింహారావు, శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు పి.అనిల్‌రావు, జి.జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో గల న్యూవిజన్ హైస్కూల్‌లో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. బాలుర విభాగంలో శివమణి 105 ఓట్లతో సమీప ప్రత్యర్థి రాంచరణ్‌పై 14 ఓట్ల తేడాతో గెలుపొందగా బాలికల విభాగంలో స్పందన 125 ఓట్లు సాధించి సమీప ప్రత్యర్థి హర్షితపై 18 ఓట్ల తేడాతో విజయం సాధించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా నర్సింహారెడ్డి, ఎన్నికల కమిషనర్‌గా మహిపాల్‌రెడ్డి వ్యవహరించి మాట్లాడారు. మొత్తం 450 మంది విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రేపు కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

నల్లబెల్లి : రేపు (ఈనెల 28న) మండలంలోని కేజీబీవీలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఎస్‌ఓ సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపుల్లో ఖాళీలున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు అవకాశం వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9494252018లో సంప్రదించాలని సూచించారు.

పింఛన్లు పెంచాలి

రాయపర్తి : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఆసరా పింఛన్ పెంచాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు, జిల్లా ఇన్‌చార్జి వంగూరి ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి 20 నెలలు గడచినా పింఛన్ పెంచకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పింఛన్ పెంపు కోసం పోరాటాలు నిర్మిస్తామని చెప్పారు. తొలుత ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండల కోఇన్‌చార్జి వశపాక కుమార్, ఐత రాజు, వీహెచ్‌పీఎస్ నాయకులు శ్రీధర్, ఐత కొమురయ్య, చిర్ర ఎల్లయ్య, ఎల్లమ్మ, కుంట మైసమ్మ, ఐత కొమురమ్మ, తాటికాయల యాకమ్మ, యాకూబీ, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి పంపిణీ

ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డకు చెందిన కాకతీయ గ్లోరియస్ ఫ్యూచర్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు స్థానిక హైస్కూల్ విద్యార్థులకు శనివారం క్యారం బోర్డులు, తదితర క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు పురుషోత్తం, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు

నెక్కొండ : స్థానిక హైస్కూల్ సెంటర్‌లోని కూరగాయలు, పండ్ల దుకాణాలను పంచాయతీ సిబ్బంది శనివారం తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈఓ సదానందం మాట్లాడారు. ఫుట్‌పాత్‌పై కూరగాయలు, పండ్ల దుకాణాల ఏర్పాటుతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్రత్యామ్నాయంగా దుకాణాల ఏర్పాటుకు సహకరిస్తామని తెలిపారు.

బిందు సేద్యం పరికరాల పంపిణీ



పరికరాలను అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాస్

నర్సంపేట : మండలంలోని లింగాపురంలో మాజీ సర్పంచ్ తప్పెట రమేశ్ ఆధ్వర్యంలో సిగ్నెట్ కంపెనీ నుంచి అందిన రూ.13 లక్షల విలువైన బిందు సేద్యం పరికరాలను 12 మంది రైతులకు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ శనివారం పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో రైతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. బిందు సేద్యం ద్వారా రైతులు నీటి వృథాను అరికట్టడంతోపాటు అధిక పంట దిగుబడులు సాధించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన వన అధికారి తరుణ్, నాయకులు కిరణ్, స్వామి, అశోక్, రాంబాబు, సంస్థ డీసీఓ చారి, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు తీసుకో.. అభివృద్ధి చెయ్..

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : బీఆర్‌ఎస్ హయాంలో మంజూరు చేసిన పనులకు సంబంధించి కాంట్రాక్టు తీసుకుని అయినా పనులు చేపట్టి అభివృద్ధి చేయాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో తాను రూ.400 కోట్లకుపైగా మంజూరు చేయించగా ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని తండాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు రూ.53 కోట్లతో పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. నల్లబెల్లి, నెక్కొండ మండలాల్లో రూ.17.69 కోట్లతో 13 రోడ్లను మంజూరు చేయించామన్నారు. నాడు మంజూరు చేసిన పనులను ఎమ్మెల్యే మాధవరెడ్డి రద్దు చేయిస్తూ నియోజకవర్గ ప్రజలపై కక్ష తీర్చుకుంటున్నారని ఆరోపించారు. టెండర్ ప్రక్రియ పూర్తి అయిన పనులను రద్దు చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా సొంత ఏజెన్సీకి రోడ్లను మార్చుకుని అధికారులను బెదిరిస్తూ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులు చేపడుతున్నారని విమర్శించారు. నల్లబెల్లి, నెక్కొండ మండలాల్లో మంజూరైన 13 రోడ్ల పనులను రద్దు చేయాలని అధికారులకు లేఖ రాసినట్టు తెలిపారు. నిధులు రద్దయితే మళ్లీ మంజూరు చేయించే సత్తా ఎమ్మెల్యేకు లేదన్నారు. రాజకీయాలకు అతీతంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే దిశగా ప్రజలు స్వచ్ఛందంగా నిరసనలు తెలిపేందుకు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, నాయకులు కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, ఊడుగుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతోనే జీవితంలో ఉన్నతి



ఖానాపురం : మాట్లాడుతున్న మురళీధర్



నర్సంపేట : మాట్లాడుతున్న ఆబిద్ అలీ



నల్లబెల్లి : మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణ

ఖానాపురం/నల్లబెల్లి/నర్సంపేట/రాయపర్తి : నైపుణ్యాలు పెంచుకుంటేనే విద్యార్థులు జీవితంలో ఉన్నతి సాధించగలరని ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మురళీధర్, నల్లబెల్లి, చెన్నారావుపేట మండలాల తహసీల్దార్లు కృష్ణ, మహ్మద్ ఆబిద్ అలీ, రాయపర్తి ఎంపీడీఓ గుగులోతు కిషన్‌నాయక్ స్పష్టం చేశారు. ఖానాపురం, నల్లబెల్లి, చెన్నారావుపేట, రాయపర్తి మండలాల్లోని కేజీబీవీల్లో, ప్రభుత్వ, మోడల్ స్కూళ్లలో శనివారం నిర్వహించిన 'స్ఫూర్తి' కార్యక్రమాలకు వారు హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో జీవన నైపుణ్యాల పెంపు దిశగా స్ఫూర్తి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆరోగ్యం, పోషణపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. శారీరక, మానసిక, సామాజిక వికాసంతోనే విద్యార్థులు అభివృద్ధి చెందుతారని తెలిపారు. విద్యార్థులతో చదువులతోపాటు ఆటపాటల్లోనూ రాణించి ఇతరులకు స్ఫూర్తినివ్వాలని కోరారు. కార్యక్రమాల్లో స్పెషల్ ఆఫీసర్లు సౌజన్య, మేనక, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీఓ సునీల్‌కుమార్, ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి, ఎంఈఓ శ్రీదేవి, వైద్యాధికారి జ్యోతి, హెచ్‌ఎంలు కృష్ణమూర్తి, జయ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులే కీలకం



రాయపర్తి : పంటను పరిశీలిస్తున్న డాక్టర్ నాగభూషణం, అధికారులు

- డీఏఏటీటీసీ కోఆర్డినేటర్ నాగభూషణం

రాయపర్తి : పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు కీలకమని డీఏఏటీటీసీ కోఆర్డినేటర్ డాక్టర్ నాగభూషణం, వ్యవసాయ శాస్త్రవేత్త సారంగం తెలిపారు. మండలంలోని మొరిపిరాలలో మండల వ్యవసాయ అధికారి వీరభద్రం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సదస్సుకు డాక్టర్ నాగభూషణం, సారంగం ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వరి సాగు చేసే రైతులు పచ్చిరొట్ట పైరుగా పెసర, జీలుగ పూత దశలో ఎస్ఎస్‌పీ వేసుకుని నేలలో కలియదున్నాలని సూచించారు. నాటు వేసిన 3-5 రోజులలోపు ప్రెటిలా క్లోర్ 600 మిల్లీలీటర్లు లేదా ప్రిటిలక్లోర్, సేఫనర్, ప్రిట్‌లాక్లోర్ ప్లస్ పైరాజోసెల ఫురాన్ 4 కేజీలు ఇసుకలో కలిపి కలుపు నివారణ చేసుకోవచ్చని చెప్పారు. వరితోపాటు పత్తి, మొక్కజొన్నలో కలుపు నివారణ, దిగుబడిపై అవగాహన కల్పించారు. తొలుత పంటలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో నిర్వహించిన సదస్సులో మండల స్పెషల్ ఆఫీసర్ సౌజన్య మాట్లాడారు. రైతులు యూరియాకు బదులు ద్రవరూపంలో ఉండే నానో యూరియాను డ్రోన్ల ద్వారా పిచికారీ చేయాలన్నారు. తద్వారా పర్యావరణానికి మేలు కలగడంతోపాటు ఆరోగ్యకరమైన, నాణ్యమైన పంట దిగుబడి సాధించొచ్చని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏఈఓ అంకుషా వలీ, పంచాయతీ కార్యదర్శి అనిత, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే 'ఉల్లాస్' ధ్యేయం

- ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాక శ్రీనివాస్



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్

గీసుకొండ : సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయంగా ప్రభుత్వం 'ఉల్లాస్' కార్యక్రమం చేపట్టిందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాక శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సెర్ప్, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పొదుపు సంఘాల్లో 1468 మంది నిరక్షరాస్యులను ప్రాథమిక సర్వేలో గుర్తించారని చెప్పారు. మొత్తంగా సుమారు 2 వేల మంది నిరక్షరాస్యులు ఉండొచ్చని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. సెర్ప్ సిబ్బంది వాలంటీర్లతో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలని, బోధనకు అనువైన ప్రదేశాలను పంచాయతీ కార్యదర్శులు ఎంపిక చేస్తారని వివరించారు. మండలంలో నూరు శాతం మహిళా సంఘాల సభ్యులు అక్షరాస్యత సాధించేలా ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని కోరారు. సమావేశంలో ఏపీఎం సురేశ్‌కుమార్, ఎంఈఓ సాంబయ్య, కార్యాలయ సూపరింటెండెంట్ కమలాకర్, సీసీలు కోల శోభ, కక్కెర్ల సుజాత తదితరులు పాల్గొన్నారు.